క్లుప్తంగా

యువతకు సుభాష్ చంద్రబోస్ స్ఫూర్తి



చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

కె.కోటపాడు: స్వాతంత్ర్య సంగ్రామంలో సుభాష్ చంద్రబోస్ చూపిన పోరాట స్ఫూర్తి యువతకు ఆదర్శనీయమని గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి తెలిపారు. ఆదివారం చౌడువాడ గ్రంథాలయంలో సుభాష్ చంద్రబోస్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

చోడవరం సీఐగా అప్పలరాజు



చోడవరం రూరల్: చోడవరం సీఐగా పి.అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు డీఐజీ గోపీనాథ్ జెట్టి ఉత్తర్వులు జారీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పోలీసు శాఖలో ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిన సంగతి విదితమే. విశాఖ రేంజ్‌లో 52 మంది సీఐలకు స్థాన చలనం కలిగించారు. వీరిలో పలువుర్ని రేంజ్ కార్యాలయంలో వేకెన్సీ రిజర్వులో ఉంచారు. చోడవరం సీఐగా బదిలీపై వచ్చిన అప్పలరాజు ప్రస్తుతం పాయకరావుపేట సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. మూడేళ్లపాటు ఇక్కడి సీఐగా పని చేస్తున్న బమ్మిడి శ్రీనివాసరావును వీఆర్‌లో ఉంచారు. నూతన సీఐ అప్పలరాజు నేడో రేపో విధుల్లో చేరనున్నారు.

196 మందికి వైద్య సేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

బుచ్చెయ్యపేట: వీఎస్సార్ సేవా సంస్థ ఆధ్వర్యంలో పొట్టిదొరపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. అనకాపల్లి ఉషాప్రేమ్ ఆస్పత్రి వైద్యులు 196 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించారు. ఈ శిబిరంలో పొట్టిదొరపాలెం, కొత్తూరు, శింగవరం, బుదిరెడ్లపాలెం, గంటికొర్లాం తదితర గ్రామాలకు చెందిన రోగులు తరలివచ్చి వైద్య సేవలు సద్వినియోగం చేసుకున్నారు. వీఎస్సార్ సేవా సంస్థ నిర్వాహకుడు ఒడ్డి సత్యారావు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

రోలుగుంట: తమ పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ పారిశుధ్య కార్మికులు ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ముందుగా ఇక్కడ వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమ సమస్యలపై చర్చించుకున్నారు. పారిశుధ్య కార్మికుల నాయకుడు శివ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తమ జీతాలు పెంచి, నెలనెలా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరాడు. లేకుంటే దశలు వారీగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

చి'వరి' దశకు నాట్లు



వీరనారాయణంలో వేస్తున్న వరినాట్లు

మాడుగుల రూరల్: ఖరీఫ్ వరినాట్లు చివరి దశకు చేరుకున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల పూర్తిస్థాయిలో వరినాట్లు పడలేదు. పెద్దేరు, తారకరామ జలాశయాలు, చెరువుల ఆయకట్టు భూముల్లో వరినాట్లు వేస్తున్నారు. దీంతో పవర్ టిల్లర్లు, మహిళా కూలీలకు డిమాండ్ పెరిగింది.

వంతెన చింత

- వర్షం కురిస్తే అగచాట్లు
- 3 గిరిజన గ్రామాలకు రాకపోకలు బంద్
- వంతెన నిర్మించాలంటూ గిరిజనుల వేడుకోలు



నిరసన తెలుపుతున్న నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన సంఘం, గిరిజనులు (ఫైల్)



వంతెన నిర్మించాల్సిన చుట్టు గెడ్డ ప్రదేశం

మాడుగుల: వర్షం కురిస్తే బాహ్య ప్రపంచంతో గిరిజన గ్రామాలకు సంబంధాలు తెగిపోతున్నాయి. చుట్టిగెడ్డ వద్ద వంతెన నిర్మించకపోవడంతో అత్యవసరమైతే అగచాట్లు పడాల్సిందే.. పూర్వకాలం నుంచి ఇదే పరిస్థితి. ప్రభుత్వాలు మారుతున్నా, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకుంటున్నా, తమ కష్టాలకు మోక్షం కలగడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని శంకరం పంచాయతీలో కృష్ణపాలెం, చుట్టు గెడ్డ, తాటిపర్తి పంచాయతీలో కూర్మనాథపురం గ్రామాల్లో వంద కుటుంబాలు నివాసముంటున్నాయి. ఈ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో విలీనం చేయకపోవడంతో ఐటీడీఏ రాయితీలు కోల్పోతున్నారు.

గత ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణం..

శతాబ్దాలుగా సరైన రవాణా సౌకర్యం లేక రాళ్లురప్పలపై రాకపోకలు సాగించే ఆయా గ్రామాల గిరిజనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మోక్షం కలిగింది. అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు అప్పట్లోనే గెడ్డపై వంతెన నిర్మించాలని నిర్ణయించారు. ఇంతలో సార్వత్రిక ఎన్నికలు రావడం, అధికారం మారడంతో దీనిపై ప్రతిపాదనలు నిలిచిపోయాయి.

వంతెన కోసం పోరాటం...

దాదాపు కోటి రూపాయలతో చుట్టి గెడ్డపై చిన్నపాటి వంతెన నిర్మిస్తే మూడు గ్రామాలకు అనాదిగా వెంటాడుతున్న రహదారి కష్టాలు తీరుతాయని గిరిజనులు చెబుతున్నారు. ప్రస్తుతం సంబంధిత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై సీపీఎం నాయకుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో పలుమార్లు నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. వంతెన నిర్మించే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఐటీడీఏలో చేర్చాలి

మైదాన గిరిజన గ్రామాలను ఐటీడీఏలో చేర్చకపోవడం వల్ల తమ బతుకులు బాగుపడలేదని, విద్య, వైద్య, ఉద్యోగాలులో షెడ్యూల్ ఏరియాలో చేర్చకపోవడం వల్ల ఆ ఫలాలు తమకు దక్కలేదని గిరిజనులు వాపోతున్నారు. షెడ్యూల్ ఏరియా గిరిజనులతో సమానంగా రాయితీలు అందజేయాలని, మైదాన ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి



వర్షం కురిస్తే గెడ్డ దాటలేక ఇబ్బందులు పడుతున్నాం. నిత్యావసర సరకులు తీసుకోవాలంటే గెడ్డ దాటాల్సిందే.. రాత్రిపూట ఏదైనా కష్టమొస్తే మా కష్టాలు వర్ణనాతీతం. గత వైఎస్సార్‌సీపీ పాలనలో రోడ్లు వేశారు. ఇంతలో ప్రభుత్వం మారిన నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి చుట్టుగెడ్డపై వంతెన నిర్మించాలి.

– జనపరెడ్డి కొండబాబు, గిరిజనుడు చుట్టుగెడ్డ

ఐటీడీఏ రాయితీలు ఇవ్వాలి



జిల్లా వ్యాప్తంగా 320 గిరిజన గ్రామాలున్నాయి. వీటన్నింటిని ఐదో షెడ్యూల్‌లో చేర్చాలి. ఐటీడీఏ రాయితీలు మైదాన గిరిజనులకు అందక విద్య, వైద్య, ఉద్యోగాల్లో తీవ్రంగా నష్టపోతున్నాం. మాడుగుల మండలం శంకరం పంచాయతీలో చుట్టుగెడ్డపై వంతెన నిర్మాణం చేపట్టాలి..

– ఇరటా నరసింహమూర్తి, నాన్ షెడ్యూల్ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి

చిత్తడిగా గిరిజన రోడ్లు



బురదమయంగా మారిన ఇప్పగరువు నుంచి పాతవాలాబు వెళ్లే రహదారి



ఛిద్రంగా మారిన వాలాబు వైపు వెళ్లే రహదారి

రాకపోకలకు వాలాబు శివారు గ్రామాల గిరిజనుల అవస్థలు

దేవరాపల్లి: వాలాబు పంచాయతీ శివారు గ్రామాల రోడ్లు చిత్తడి చిత్తడి మారాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో ఆయా గ్రామాల మట్టి రోడ్లన్నీ బురదమయం అయ్యాయి. దీంతో గిరిజనులు తప్పనిసరి పరిస్థితుల్లో ఆయా రహదారుల్లో రాకపోకలు సాగిస్తూ తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. రోడ్లన్నీ బురదమయంగా మారడంతో వృద్ధులు, మహిళలు నానా అవస్థలు పడుతున్నారు. అటుగా వెళ్లే ఉపాధ్యాయులు, ఇతర ఉద్యోగులు అడుగు పెట్టలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్ర వాహనం వెళ్లే పరిస్థితి లేదు. బురద రోడ్లలో ఇప్పటికే పలువురు జారి పడిన సంఘటనలు ఉన్నాయి. ప్రధానంగా ఇప్పగరువు నుంచి పాత వాలాబు వెళ్లే రహదారి మరీ దారుణంగా ఉంది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి వాలాబు పంచాయతీ శివారు గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని గిరిజనులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఉపాధ్యాయుడు అమృతరావుకు పురస్కారం



అమృతరావును దుశ్శాలువాతో సన్మానించి జ్ఞాపిక అందిస్తున్న నిర్వాహకులు

కె.కోటపాడు: చిన్నారావు వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విశాఖపట్నం సెంట్రల్ లైబ్రరీలో ఈ నెల 16న ఎ.కోడూరు హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు జే అమృతరావుకు జీవీఎంసీ జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ ఏపీజే అబ్దుల్ కలాం పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందించారు. సాహిత్యంపై మక్కువతో స్ఫూర్తిదాయకమైన కవితలతో ఆకట్టుకుంటున్న ఉపాధ్యాయుడిని అభినందించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ చిన్నారావు తదితరులు పాల్గొన్నారు. ఈ పురస్కారం రావడం తనకు చాలా ఆనందంగా ఉందని ఉపాధ్యాయుడు ఆదివారం తెలిపారు.

స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి



సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న స్వీపర్లు

రోలుగుంట: పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ల న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం రోలుగుంటలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ ప్రతి నెలా జీతాలు చెల్లించక కుటుంబ పోషణకు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. సర్వీసు కాలం ఆధారంగా వీరినే పాఠశాల వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. గుర్తింపుకార్డులిచ్చి యూనిఫాం ఇవ్వాలన్నారు. పని ఒత్తిడి తగ్గించాలన్నారు. పెండింగు వేతనాలు సత్వరమే చెల్లించి ఆదుకోవాలనే, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షునికి పరామర్శ



తెలుగు రైతు ఉపాధ్యక్షుడిని పరామర్శిస్తున్న సీపీఐ నేతలు

చోడవరం రూరల్: ఇటీవల అస్వస్థతకు గురైన తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, చోడవరం మాజీ సర్పంచ్ గూనూరు మల్లునాయుడును పలువురు సీపీఐ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పరామర్శించారు. ఆదివారం ఆయన స్వగృహంలో మల్లునాయుడును సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు, మహిళా సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గోవాడ కనకమహాలక్ష్మి, ఆటోతుల శ్రీనివాసరావు, పిల్లి అప్పలరాజు, బానయ్య కోనేరు సంక్షేమ సంఘం ప్రతినిధులు కోడి దుర్గ, రామవరపు కుమారి, ఒమ్మి సత్యవతి, సోమాధుల దేవి, మచ్చ ఈశ్వరమ్మ, పీలా వెంకటేశ్వరి తదితరులు కలిశారు. ఆయన ఆరోగ్య సమాచారాన్ని తెలుసుకున్నారు. త్వరగా స్వస్థత చేకూరాలని కోరుకున్నారు.



ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు సందర్శకులతో ఆదివారం కళకళలాడాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులతో కిటకిటలాడాయి. తీరంలో ఇసుక తిన్నెలపై వాలీబాల్, క్రికెట్, కబడ్డీ వంటి ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. సాయంత్రం సముద్ర స్నానాలు చేసి ఇంటి ముఖం పట్టారు. - పరవాడ

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు అభినందన

పలుచోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల విజయం



ఎ. కొత్తపల్లిలో హైస్కూల్, ఎంపీపీ స్కూల్స్ చైర్మన్లను అభినందిస్తున్న సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ



కొండెంపూడి చైర్మన్‌ను అభినందిస్తున్న గ్రామ నాయకులు



బుచ్చెయ్యపేట: చిన భీమవరంలో టాస్‌లో గెలిచిన శ్రీనిధిని అభినందిస్తున్న నాయకులు



బోయిలకింతాడ కొత్తూరులో చైర్మన్‌ను అభినందిస్తున్న వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు



ఎం. కోటపాడులో చైర్మన్, వైస్ చైర్మన్‌ను అభినందిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ కొండలరావు



బుచ్చెయ్యపేట: వడ్డాదిలోని మూడు పాఠశాలల్లో గెలిచిన అభ్యర్థులను అభినందిస్తున్న నాయకులు

దేవరాపల్లి: ఎ. కొత్తపల్లి హైస్కూల్‌తోపాటు రెండు ఎంపీపీ స్కూళ్లలో ఎస్ఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించారు. ఈ సందర్భంగా హైస్కూల్ చైర్మన్ లక్కరాజు అప్పలనర్సమ్మ, ఎంపీపీ స్కూల్ చైర్మన్ గనివాడ శివాజీ, అచ్చియ్యపాలెం ఎంపీపీ స్కూల్ చైర్మన్ పెద్దాడ గణేషలను సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, ఉప సర్పంచ్ పండూరు సరువునాయుడు తదితర గ్రామ పెద్దలు అభినందించారు. బోయిలకింతాడ దరి కొత్తూరులో ఎంపీపీ స్కూల్ చైర్మన్ బొబ్బిలి త్రిమూర్తులు, వైస్ చైర్మన్ కణితి చుక్కమ్మలను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ బూరె బాబూరావు తదితర గ్రామ పెద్దలు అభినందించారు.

బుచ్చెయ్యపేట: దిబ్బిడి ప్రాథమిక పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మండపాక శివ, జెడ్పీ హైస్కూల్ చైర్మన్ పల్లి అప్పారావు, పి. కొండెంపూడి పాఠశాల చైర్మన్ ఆది శ్యామ్‌కుమార్, చినభీమవరం పాఠశాలలో శ్రీనిధి ఎన్నికయ్యారు. వీరిని ఆయా గ్రామ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

మాడుగుల రూరల్: ఎం. కోటపాడు ఎంపీయూపీ ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ తాటికొండ రాజుబాబు, వైస్ చైర్మన్ కటా మణిలను మాడుగుల ఏఎంసీ మాజీ చైర్మన్ శానాపతి కొండలరావు, గ్రామ సర్పంచ్ శానాపతి శేషఫణి, గంగాధర్ అభినందించారు.

మార్కెట్లో రాఖీల సందడి



ఘాట్‌రోడ్‌లో విక్రయానికి సిద్ధంగా రాఖీలు

మాడుగుల: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండగకు సర్వం సిద్ధమవుతోంది. ఇప్పటికే మాడుగులలో ప్రత్యేకంగా రాఖీ దుకాణాలు వెలిశాయి. ఇక్కడ రంగు రంగులతో రకరకాలు రాఖీలు విక్రయానికి సిద్ధంగా ఉంచారు. పలువురు వీటిని కొనుగోలు చేసి సోమవారం రాఖీ వేడుక ఆనందంగా జరుపుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

కోతదశలో బరబాటి పంట



పాతవలసలో పంట

కె.కోటపాడు: మండలంలో బరబాటి పంట కోత దశకు చేరుకుంది. తక్కువ పెట్టుబడితోపాటు స్వల్పకాల వ్యవధిలో చేతికంది వచ్చే పంట కావడంతో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పంటకు ఎనిమిది వేల రూపాయల వరకూ ఖర్చవుతుందని, మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో లాభదాయకంగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మర్రివలస, లంకవానిపాలెం, పింద్రంగి, పాతవలస, కె.సంతపాలెం గ్రామాల్లో 50 ఎకరాల్లో పంట కోత దశకు చేరుకుంది.

సీఐ వినోద్‌బాబు బదిలీ

కశింకోట: స్థానిక సీఐ ఎం.వినోద్‌బాబు బదిలీ అయ్యారు. ఆయన్ని వీఆర్‌లో ఉంచారు. ఆ స్థానంలో వీఆర్‌లో ఉన్న స్వామినాయుడుని సీఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆదివారం తెలిసింది. ఇంకా బాధ్యతలు చేపట్టాల్సి ఉంది. స్వామినాయుడు గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేశారు. సీఐగా పదోన్నతి పొంది అనకాపల్లి ట్రాఫిక్‌లో విధులు నిర్వర్తించారు. వీఆర్ నుంచి ఇప్పుడు సీఐగా మళ్లీ కశింకోట రానున్నట్లు సమాచారం. సార్వత్రిక ఎన్నికల ముందు సీఐ స్టేషన్‌గా కశింకోటను అప్‌గ్రేడ్ చేయడంతో ఈ ఏడాది జనవరిలో శ్రీకాకుళం నుంచి వినోద్‌బాబు బదిలీపై వచ్చారు. అనతి కాలంలోనే ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్నారు. ఇక్కడి ఎస్ఐ రమేష్‌బాబు గత నెలాఖరున పదవీ విరమణ చేయడంతో విశాఖ సిటీలో పనిచేసే ఎస్ఐ వి.ప్రసాదరావును ఆ స్థానంలో నియమించారు.

ఆలయ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలి



వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ కోరారు. మునగపాకలో రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శ్రీనివాసుని ఆలయానికి భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం మునగపాకకు చెందిన బుదిరెడ్డి అప్పలనాయుడు-రమాదేవి దంపతుల కుమారుడు, కోడలు ఉదయ-వాణి దంపతులు రూ.55,555 నగదును ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల విరాళాలతో ఆలయ నిర్మాణం జరుగుతుందని, అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, పెంటకోట ఉమేష్, ఆడారి అచ్చియ్యనాయుడు, వెలగా శ్రీనివాసరావు, జల్లేపల్లి కిష్టప్ప, విల్లూరి మోహన్, ఆడారి కృష్ణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జాగ్రత్తలతో నేత్రాలు పదిలం



రెటీనా పరీక్షలు చేయించుకుంటున్న డీజీ నాథ్

పాయకరావుపేట : ప్రతి ఒక్కరూ కంటి ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డీజీ నాథ్ తెలిపారు. ఆదివారం హైమ నేత్రాలయం సహకారంతో స్థానికంగా ఏర్పాటు చేసిన రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హైమ నేత్రాలయం సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి సీఈవో డాక్టర్ పీఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా షుగర్, బీపీ, సెల్‌ఫోన్ అతిగా వినియోగించడం వల్ల కంటి సమస్యలతో చాలా మంది బాధపడుతున్నారని అన్నారు. రెటీనా స్క్రీనింగ్ క్యాంపునకు మండలంలో ఉపాధ్యాయులు హాజరై కంటి పరీక్షలు చేయించుకోవడం శుభపరిణామం అన్నారు. డాక్టర్ సువర్ణ మాట్లాడుతూ షుగర్ వ్యాధి వలన కంటి రెటీనా డిటాచ్మెంట్, రెటీనా హేమరేజ్, డయాబెటిక్ రెటినోపతి వంటి సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఏపీ సూర్యనారాయణ, కార్యదర్శి పి.హరికృష్ణ, ఆర్.వీరభద్రరావు, పి.ఉమామహేశ్వరరావు, టి.తాతారావు, సత్య శ్రీనివాస్, టి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యోగా, వ్యాయామంతో ఆరోగ్య సంరక్షణ



ఫిజియోథెరపిస్టు అపర్ణను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లి: వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, నిత్యం వ్యాయామం, యోగా చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రముఖ ఫిజియోథెరపిస్టు పీహెచ్ఎస్ అపర్ణ అన్నారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ గుమస్తాల సంఘం కార్యాలయంలో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఫిజియోథెరపీపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మానవుని జీవనశైలిలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రజలు జాగ్రత్త లు తీసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడికి వల్లే ఎక్కువగా వ్యాధుల బారినపడే అవకాశాలుంటాయన్నారు. వ్యాధి సోకిన తొలి దశలో వైద్యులను సంప్రదిస్తే త్వరితగతిన నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం క్లబ్ సభ్యులు అపర్ణను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందించారు. క్లబ్ అధ్యక్షుడు భీశెట్టి రామకృష్ణ, సూరిబాబు, కుమార్ పాల్గొన్నారు.

మట్టి గణపతిని పూజించాలంటూ అవగాహన ర్యాలీ

అనకాపల్లి: భావితరాలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణ పరిరక్షణకు సెప్టెంబర్ 7న జరిగే వినాయక చవితికి మట్టి గణపతులనే పూజించాలని వినాయక ఉత్సవ సామూహిక నిమజ్జనోత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి పిలుపునిచ్చారు. ఈ మేరకు కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం మట్టి గణపతి విగ్రహాలను చేతబట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించి ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలను విడనాడాలని సూచించారు. మట్టి గణపతులు నదుల్లో, చెరువుల్లో తొందరగా కరిగి పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కమిటీ సభ్యులు పి.సోమశేఖర్‌పట్నాయక్, దాడి బుజ్జి, పెంటకోట వరప్రసాద్, కర్రి భరత్, మహిళలు పాల్గొన్నారు.